ముంపు నీటిలో చేలగాటం

- నీట మునిగిన తొలకరి నాట్లు
- పట్టించుకోని డ్రెయిన్స్ అధికారులు



భీమనపల్లిలో నీటమునిగిన వరి చేలు

ఉప్పలగుప్తం: పూర్వం మూడు పంటలు పండించుకుని ఆనందంగా జీవనాన్ని సాగించే రైతన్నకు ప్రస్తుతం తొలకరి సాగు ఆటుపోట్లతో కత్తిమీద సాములా తయ్యారయింది. వ్యవసాయం ఆధారంగా నమ్మి అప్పులు తెచ్చి సాగు చేస్తున్న రైతుకు తిప్పలు తప్పడం లేదు. ఆరుగాలం శ్రమించిన రైతన్నకు తొలకరి ఏటా నిరాశే మిగులుస్తుంది. అందువల్లే కొన్ని ప్రాంతాల్లో రైతులు తొలకరికి ఆసక్తి చూపడం లేదు. గత రెండేళ్లుగా ఖరీఫ్‌లో అతిగా వర్షాలు కురవడం, డ్రెయిన్‌లు దిగకపోవడంతో సాగు చేసి నష్టపోవడం కన్నా ఖాళీగా వదిలి వేయడం మేలని నిర్ణయించుకుంటున్నారు. ప్రభుత్వం డ్రెయిన్‌ల తవ్వకాలు చేస్తున్నామని భరోసా ఇవ్వడంతో ఖరీఫ్ సాగుకు ముందుకు సాగారు రైతన్నలు. ఇంతలో అమాంతంగా గత పదిరోజల క్రితం కురిసిన భారీ వర్షానికి, ఎగువ ప్రాంతాల్లో గోదావరి ప్రవాహాల కారణంగా నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించడంతో రైతన్నల ఆశ నిరాశయింది. దీనికి ప్రధాన కారణం మేజర్, మీడియం, మైనర్, రెవెన్యూ డ్రెయిన్లలో నీరు వరిచేల కంటే రెండు నుంచి మూడడుగుల ఎత్తు ఉండటం. వరి చేలల్లో నీరు దిగే పరిస్థితి లేక దిక్కుదోచని స్థితిలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అమలాపురం నియోజకవర్గంలో అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో 13,662 ఎకరాల్లో సాగు ఖరీఫ్ సాగు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 10,833 ఎకరాల్లో సాగు పూర్తయింది. వాటిలో గత పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు 1380 ఎకరాల్లో నాట్లు వేసిన చేలు నీట మునిగాయి. కొంత మేర మెరక ప్రాంతాల్లో నాట్లు ముంపు నుంచిబయట పడినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇంకా ముంపులోనే దఉన్నాయి. ఈ మూడు మండలాల్లో ప్రధానంగా రామేశ్వరం మొగ, కూనవరం మేజర్ డ్రెయిన్‌లకు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్‌ల సహాయంతో ముంపు నీరు సముద్రానికి చేరుతుంది. గత సంవత్సర కాలం క్రితం రామేశ్వరం మొగను ఆధునీకరించనప్పటికీ అది గత కొంతకాలం క్రితం మేటలతో మూసివేయడంతో గత పదిహేను రోజులుగా రైతులు నానాఅవస్థలు పడ్డారు. గత రెండు రోజుల క్రితం రామేశ్వరం మొగను అధికారులు మరలా తెరవడంతో ఇప్పుడిప్పుడే నీరు సముద్రానికి చేరుతుంది. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ముంపు నీరు గోదావరి పాయల గుండా డ్రెయిన్‌లలోకి ప్రవేశించి తిరిగి మరలా పంట చేలల్లోకి ప్రవేసిస్తుందని, ఆక్వా చెరువుల వ్యర్థాలు సైతం అవే డ్రెయిన్లలోకి విడిచి పెడుతున్నారని రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. దీంతో పాటు పంట కాలువల్లో పలు చోట్ల స్లూయిజ్‌లు తుప్పుపట్టి గేట్లు పగిలి పంట కాలువల్లో సైతం నీరు అధికంగా ప్రవేశిస్తుందని రైతన్నలు వాపోతున్నారు. ఈ విషయాలను డ్రెయిన్స్, ఇరిగేషన్ అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ప్రయోజనం ఉండటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రైతులకు సహకారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నారు వేసి నష్టపోయాను



నాకు 13 ఎకరాల వ్యవసాయం ఉంది. దానికి సంబంధించి ఇప్పటికే 8 ఎకరాలు సాగు చేశాను. మిగతా 5 ఎకరాల్లో చేలు దమ్ము చేసి నాట్లుకు సిద్ధం చేసుకున్నాను. నాట్లు వేసే సరికి ముంపు సంభవించింది. దాదాపుగా రూ.60 వేలు ఖర్చు చేశాను. నీరు తీసిన నాట్లు వేయడానికి సమయం లేదు. నాట్లు వేసిన చేలకు ప్రతీ రోజు నీరు ఇంజిన్లతో తోడుతున్నాను. డీజిల్‌కు రోజూ రూ.1500 ఖర్చవుతుంది.

– మారిశెట్టి పుండరీకాక్షుడు, రైతు, గొల్లవిల్లి

డ్రెయిన్స్ అధికారుల నిర్లక్ష్యమే కారణం



నేను 15 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. నాట్లు వేసి తొలి విడత మందు చల్లే సమయానికి వర్షంతో ముంపు సంభవించి చేను నీట మునిగింది. గత ప్రభుత్వంలో రంగరాజుకోడును రూ.94 లక్షలతో తవ్వారు. దానికి అనుసంధానంగా ఉన్న కూనవరం మేజర్ డ్రెయిన్ ఏడాది నుంచి తవ్వుతున్నామని కాలయాపన చేస్తున్నారు. దాంతో ముంపు మరింత పెరిగింది. ఏ విషయం చెప్పినా స్పందించని తీరులో అధికారులు వ్యవహరిస్తున్నారు.

– యాళ్ల లక్ష్మీనారాయణ, రైతు, భీమనపల్లి

ముంపు నీటిని బయటకు దింపాలి



ముంపుకు గురైన వరిచేలల్లో ముంపు నీటిని రైతు బయటకు దింపాలి. వర్షాలు సంభవిస్తున్నప్పుడు కొన్ని చోట్ల వరి చేలల్లో నీరు దిగకపోవటం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. నీరు పూర్తిగా తీసిన రైతులు ఎకరాకు 10 కేజీ యూరియా, 10 కేజీల పొటాష్ బూస్టర్ డోస్‌గా అందించాలి. హెక్సాకోనోజోల్ ఎకరాకు లీటరుకు 2 ఎంఎల్‌ను అందిస్తే కుళ్ల తెగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

– జి.కుమార్‌బాబు, ఏవో, ఉప్పలగుప్తం

మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోండి

అల్లవరం: మండలంలోని గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో మౌలిక సౌకర్యాలు లేక 400 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ పాఠశాలకు చెందిన పేరెంట్స్ కమిటీ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్‌ని కలసి వినతిపత్రం ఇచ్చారు. తొలుత జిల్లా కలెక్టరేట్ ముందు గురుకులంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై తల్లిదండ్రులు ప్లకార్డులు ధరించి నిరసన తెలిపారు. పాఠశాలలో పారిశుధ్యం లోపించిందని, టాయిలెట్లో నీరు రాక ఆరుబయట స్నానాలు చేసే దయనీయ పరిస్థితిని విద్యార్థులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గురుకులంలో సెక్యూరిటీ వ్యవస్థ పూర్తిగా లోపించిందని, రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యత తీసుకోవడం లేదన్నారు. పలు సమస్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ని కలసి వినతిపత్రం అందించారు. పేరెంట్స్ కమిటీటీ చైర్మన్ బీర భరత్‌కుమార్, సభ్యులు తెన్నేటి బాబూరావు, స్వాతి, మొసలి లక్ష్మి, దిద్దే ప్రభాకర్, పాలమూరి శ్రీనివాసరావు, ముత్తాబత్తుల రమేష్, మల్లాడి లక్ష్మి తదితరులు కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు

అమలాపురం రూరల్: రేషన్ అక్రమాలకు చెక్ పెడుతూ అత్యంత పారదర్శకంగా పంపిణీ చేసేలా క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ కార్డులను రూపొందించిందని వీటిని ఈనెల ఆరో తేదీ నుంచి ప్రజా ప్రతినిధుల సమక్షంలో పంపిణీకి చర్యలు తీసుకోవాలని డీఆర్‌వో కొత్త మాధవి పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన అందించే దిశగా కీప్ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ అన్నింటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలి

ముమ్మిడివరం: వృత్తిపరమైన సాఫ్ట్ స్కిల్స్‌ను మెరుగు పరచుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అతిథి లెక్చరర్ సయ్యద్ అలీ నకీ అబిద్ మాస్మాశహద్ది సూచించారు. ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్ అధ్యక్షతన స్కిల్ డెవలప్‌మెంట్‌పై సోమవారం జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉన్నత స్థాయికి ఎదగాలంటే సాఫ్ట్ సిల్స్ ఎంతో అవసరమన్నారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్ మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యం ఎంత ముఖ్యమో సాఫ్ట్ స్కిల్స్ అంతే అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



వరదరాజన్

యానాం: నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు భయాందోళనలు చెందకుండా ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనిస్తానని ఆ విధంగా ప్రజలతో స్నేహసంబంధాలు ఏర్పాటు చేసుకుంటామని నూతన ఎస్పీ కె.వరదరాజన్ పేర్కొన్నారు. ఆయన యానాం ఎస్పీగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీసు యంత్రాంగం 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికాబద్ధంగా విధుల నిర్వహణకు, అదే విధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు పారదర్శకత, సమర్థతను పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

స్మార్ట్ కార్డులతో సేవలు సులభం

తాళ్లరేవు: ప్రజా పంపిణీ వ్యవస్థలో స్మార్ట్ కార్డుల వినియోగం ద్వారా సేవలు సులభతరం కానున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. సోమవారం కోరంగి పంచాయతీ సీతారామపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వినియోగదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సరుకులు పొందవచ్చని తెలిపారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద తదితరులు మాట్లాడారు. మండలంలో 47 రేషన్ దుకాణాలకు గానూ 27,050 స్మార్ట్ కార్డులను పంపిణీ చేయన్నుట్లు తహసీల్దార్ పి.త్రినాథరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, సర్పంచ్ పెయ్యల మంగేష్, కూటమి నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



ముమ్మిడివరం: మండలంలో సీహెచ్ గున్నేపల్లిలో షిర్డీ సాయిబాబా మందిర 25వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయి పురోహిత్ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో సామూహిక సత్యవ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం బాబా గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని బాబా తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్కేబీఆర్ ప్రిన్సిపాల్‌గా సుబ్బారావు



అమలాపురం రూరల్: కోనసీమ భానోజీ రామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వడలి సుబ్బారావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన నూకల శ్రీనివాస్ ఉద్యోగ విరమణ చేయడంతో కళాశాలలో 29 ఏళ్లగా భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా సేవలిందిస్తున్న సుబ్బారావును కళాశాల ప్రిన్సిపాల్‌గా కళాశాల పాలకవర్గం ఎంపిక చేసింది. ప్రిన్సిపాల్ సుబ్బారావును పాలకవర్గ అధ్యక్షుడు ఎన్.సుబ్బరాజు, కార్యదర్శి టి.అవధాని, సభ్యులు డీఎస్ఎన్ రాజు, పరిపాలనాధికారి వెంకటపతి రాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

బలహీన వర్గాల జీవనోపాధికి ఆర్థిక భద్రత

అమలాపురం రూరల్: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు బలహీన వర్గాల జీవనోపాధికి తోడ్పడి, ఆర్థిక భద్రతతో గౌరవం కలిగించే సంక్షేమ పథకమని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. అమలాపురం మండలం కొంకాపల్లిలో సోమవారం పింఛన్ల పంపిణీలో పాల్గొని దివ్యాంగురాలు కన్నెపాముల శాంతికి రూ.10 వేల పింఛను ఇంటి వద్దే అందించారు. అలాగే కొల్లు చంద్రకాంతం అనే మహిళకు ఇంటి వద్దే రూ.4 వేల వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాయినాథ్ జయచంద్ర గాంధీ, తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్, కార్యదర్శి ఆర్.సూరపరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సురేష్‌కుమార్ కృషి అభినందనీయం

అమలాపురం రూరల్: ఉద్యోగ జీవితమంతా జిల్లాలో క్రీడల అభివృద్ధికి, యువతలో క్రీడా స్ఫూర్తి పెంచి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ప్రోత్సహించడానికి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పీఎస్ సురేష్‌కుమార్ కృషి చేశారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆయన సేవలను కీర్తించారు. సురేష్ కుమార్ ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ సోమవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయన మార్గదర్శకత్వంలో అనేకమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకొని గౌరవం తెచ్చుకున్నారన్నారు. క్రీడలకే వన్నెతెచ్చిన క్రీడాస్ఫూర్తిని చాటుతూ ఈ ప్రాంత క్రీడాకారుల మన్ననలు పొందారన్నారు. జిల్లా క్రీడా వసతుల అభివృద్ధి, పోటీల నిర్వహణ, క్రీడాకారుల శిక్షణ వంటి అన్ని రంగాల్లో సురేష్‌కుమార్ చేసిన కృషి నిలిచిపోతుందన్నారు. డ్వామా పీడీ మధుసూదన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాము, ఎన్టీఆర్ డీఎస్‌డీవో అజీజ్, భీమేష్, గణేష్మూర్తి, కల్వకుంట్ల నానాజీ, పి.రామచంద్రమూర్తి, డీఎస్ఓ జీవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి ఉద్యోగ జీవితమంతా మహిళా శిశు సంక్షేమం కోసం విశేష కృషి చేశారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కొనియాడారు. కలెక్టరేట్ ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి ఉద్యోగ విరమణ సభను కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. అధికారులు, సీడీపీవోలు, ఆమె కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి సురేష్ కుమార్‌ను సత్కరిస్తున్న కలెక్టర్

వేతనాలు విడుదల చేయాలి

యానాం: నెలల తరబడి బకాయి ఉన్న వేతనాలను విడుదల చేసి తమను ఆదుకోవాలంటూ సోమవారం యానాం మున్సిపల్ సిబ్బంది స్థానిక ఆర్‌ఏవో ఆఫీసు సమీపాన ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందికి జీతాలు అందించడంలో ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందని నెలల తరబడి జీతాలు లేకపోవడంతో తమ కుటుంబాలు పలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడో వేతన సంఘం సిఫారసులను సైతం అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని వారికి పింఛన్ ఇవ్వాలని కోరారు. ఆందోళన శిబిరం వద్దకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, మెల్లం శ్రీనివాస్ వచ్చి ఆందోళనకారులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నేతలు పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన

అమలాపురం టౌన్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాతృమూర్తిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా బీజేపీ నాయకులు స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్‌లు ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర నారీ శక్తి కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకురుమిల్లి శ్రీనివాసరావు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆకుమర్తి బేబీరాణి, పార్టీ రాష్ట్ర నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. పట్టణ ఎస్సై టి.శ్రీనివాస్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.



అమలాపురంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న జిల్లా బీజేపీ నాయకులు

ఎల్జీని కలసిన మల్లాడి



ఎల్జీ కైలాసనాథన్‌ను కలసిన మల్లాడి

యానాం: సముద్రంలో ఐలాండ్-5 మీదుగా వెళ్లిన ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ అగ్నిప్రమాదానికి సంబంధించి ఇటీవల జరిగిన ఘటనలో బాధితులందరికీ పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాజ్‌నివాస్‌లో ఎల్జీ కె.కైలాసనాథన్‌ను కలసి వినతిపత్రం అందజేసినట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. అనంతరం సీఎం రంగసామి, పుదుచ్చేరి కలెక్టర్ కులొంగొత్తన్‌ను కలసి ఈ సమస్యపై సమీక్షించినట్లు తెలిపారు. గ్యాస్ లీక్ ఘటనపై అటవీ, పర్యావరణ తదితర శాఖల ద్వారా విచారణ నిర్వహించేలా అధికారులను యానాంకు పంపుతున్నట్లు సీఎం తెలిపారన్నారు.

సమస్యలపై సీఎంకు వినతి



సీఎం రంగసామికి వినతిపత్రం అందిస్తున్న తోట రాజు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ప్రముఖ వ్యాపారి, సామాజికవేత్త తోట రాజు సోమవారం పుదుచ్చేరి సీఎం రంగసామికి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓఎన్జీసీ పైపులైను ప్రమాదానికి సంబంధించి తీరగ్రామ ప్రాంతాల బాధితులకు పరిహారం చెల్లించాలని, ఆ విధంగా దరియాలతిప్ప పరిధిలో అన్ని గ్రామాలకు, ఎస్సీ సొసైటీ భూముల రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. ఐలాండ్-3 చుట్టూ రక్షణగోడ నిర్మాణం చేయాలని, చమురు సంస్థలైన ఓఎన్జీసీ, రిలయన్స్ వంటి సంస్థల్లో నిరుద్యోగయువతకు ఉపాధి, మత్స్యకారులతో పాటు మిగిలిన సామాజిక వర్గాలకు పరిహారం చెల్లించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ 'కుడుపూడి'కి సత్కారం



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లోని రాయుడు వెంకటరెడ్డి జంక్షన్‌లో నెలకొల్పిన వినాయక చవితి నవరాత్ర ఉత్సవాల్లో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావును ఆ ఉత్సవాల కమిటీ ప్రతినిధులు సోమవారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఉత్సవాల కమిటీ ప్రతినిధి డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జరిగిన నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ దొమ్మేటి రాము, కోనసీమ జేఏసీ నాయకుడు కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. సూర్యనగర్‌లో ఉత్సవాల సందర్భంగా యువత ఆధ్వర్యంలో భారీ అన్నదానం జరిగింది.

జలసీమలు

- వరద ముంపులో ఆక్వా చెరువులు
- నీట మునిగిన పాదులు, తోటలు
- లంకల్లో పెరిగిన ముంపు
- బిక్కుబిక్కుమంటున్న ప్రజలు

ఐ.పోలవరం: గోదావరి వరద ఆక్వా చెరువులను ముంచేసింది. ఏటిగట్టు దిగువన ఉన్న చెరువుల్లో వరద చేరింది. నదీగర్భాన్ని ఆనుకుని సాగు చేసే రైతులు వరదల సీజన్‌కు సాగు పూర్తి చేసుకునేలా షెడ్యూల్ సిద్ధం చేసుకుంటారు. వరద వల్ల ప్రస్తుతం పెద్దగా నష్టం లేకున్నా.. అక్కడక్కడా రెండో పంటకు సిద్ధం చేసిన చెరువుల్లో వరద చేరడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం మండలాల్లో నదీపాయలు, ఏటిగట్లను ఆనుకుని ఆక్వా సాగు పెద్ద ఎత్తున సాగువుతున్న విషయం తెలిసిందే. ఐలెండ్ చుట్టూ మురమళ్ల, జి.మూలపాలెం, గుత్తెనదీవి, తిల్లకుప్ప, పశువుల్లంక, పాత ఇంజరం, ఎదుర్లంకలతో పాటు కాట్రేనికోన మండలంలో పల్లంకుర్రు, కుండలేశ్వరం, మొక్కలతిప్ప, గొల్లగరువు, ముమ్మిడివరం మండలం అన్నంపల్లి, అల్లవరం మండలం ఓడలరేవు, బెండమూర్లంక, గోడితిప్ప వంటి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆక్వా సాగు జరుగుతోంది. తొంభై శాతం చెరువుల్లో ప్రస్తుతం ఆక్వా సాగు జరగడం లేదు. అయితే కొన్ని ప్రాంతాల్లో రైతులు రెండో పంట వేసుకున్నారు. అలాగే రెండో పంటలకు చెరువులు సిద్ధం చేసుకున్నారు. ఇప్పుడు వరద పోటెత్తడంతో వారు ఆందోళన చెందుతున్నారు. చెరువుల చుట్టూ వలలు కట్టుకుని రొయ్యలను కాపాడుకుంటున్నారు. అలాగే వరదలు వచ్చే బురద చెరువుల్లో చేరుతోంది. దీనికి తోడు విద్యుత్, మోటార్ ఇంజిన్లు నీట మునిగాయి. చెరువుల వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నివాసాలు సైతం వరద ముంపులో చిక్కుకున్నాయి. పాత ఇంజరం, ఎదుర్లంకలో అయితే చెరువులు వరద నీటితో గోదావరిని తలపిస్తున్నాయి.

మరింత పెరిగిన ఉధృతి

ఐ.పోలవరం మండలంలో వరద మరింత పెరిగింది. ఆక్వా చెరువులనే కాకుండా కొబ్బరి, కొబ్బరిలో అంతర పంటలను వరద ముంచెత్తింది. ముఖ్యంగా ముమ్మిడివరంలో కూరగాయ పంటలకు అధిక నష్టం వాటిల్లనుంది. ఇంచుమించు నెల రోజులుగా వరద ఉధృతంగా ఉండడం వల్ల పలుచోట్ల నదీ కోత పెరిగిందని రైతులు చెబుతున్నారు. మండలంలో కేశనకుర్రు శివారు పల్లిగూడెంలో నివాస ప్రాంతాల్లోకి నీరు చేరింది. రెండు, మూడడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తుండంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కొమరగిరిలో సైతం వరద చేరింది. అన్నంపల్లి పాత, కొత్త అక్విడెక్టులు పైకి వచ్చేలా వరద ప్రవహిస్తోంది.

మళ్లీ ముంచెత్తిన వరద

అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రభావానికి అల్లవరం మండలం జాతీయ రహదారి ఆనుకుని బోడసకుర్రులోని పల్లిపాలాన్ని వరద ముంచెత్తింది. వారం రోజులు గడవక మునుపే మళ్లీ వరద రెండో సారి పల్లిపాలెంలోని మత్స్యకారులు ఇళ్లల్లోకి చేరింది. గతం కన్నా ఈ సారి వరద తీవ్రత ఎక్కువగా ఉంది. ఆదివారం నాటికి వరద కాలనీలోకి రాగా, సోమవారం నాటికి పల్లిపాలెం సగానికి పైగా వరద నీటిలో చిక్కుకుంది. సుమారు 70 ఇళ్లు వరద నీటిలో ఉన్నాయి. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నా అధికారులు కనీసం కానరాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద కారణంగా వైనతేయ నది నుంచి గోపాయిలంక అవుట్ ఫాల్ స్లూయిజ్ ద్వారా వరద నీరు కుమ్మరి కాలువలోకి ఎదురెక్కుతుంది. దీని ప్రభావంతో అల్లవరం మండలంలో కోడూరుపాడు, అల్లవరం, అమలాపురం రూరల్ పరిధిలోని పేరూరు, కొంకాపల్లి, బండారులంక, జనుపల్లి గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, వరి పొలాలు ముంపు బారిన పడుతున్నాయి.



ఐ.పోలవరం మండలం కేశనకుర్రు పల్లిగూడెంలో నివాస ప్రాంతాల మధ్యలో వరద నీరు



పాత ఇంజరంలో నీట మునిగిన ఆక్వా చెరువులు



బోడసకుర్రు పల్లిపాలెంలో వరద నీటిలో చిక్కుకున్న బాధితులకు తాగునీరు పంపిణీ

ఘనంగా రక్షాహరికృష్ణ జయంతి

యానాం: మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ మత్స్యకార నాయకుడు దివంగత రక్షా హరికృష్ణ జయంతిని సోమవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ రివర్‌బీచ్ వద్దనున్న ఆయన విగ్రహానికి పీడబ్ల్యూడీ ఈఈ నాగరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ యానాం నియోజకవర్గ అభివృద్ధికి, మత్స్యకారుల అభ్యున్నతికి రక్షాహరికృష్ణ చేసిన సేవలను కొనియాడారు. రిటైర్డ్ ఆర్ఎఓ గిడ్డి బలరామ్, మాగాపు సుబ్బారావు, రక్షా శ్రీను, గోపీసురేష్, మత్స్యశాఖ అధికారి గౌంతియ్య, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మెట్టకూరు ఫిషర్‌మెన్ పేటలో రక్షాహరికృష్ణ విగ్రహానికి ఆ గ్రామస్తులు నివాళులర్పించారు.



రక్షాహరికృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గణపతిబప్పా మోరియా..

ముమ్మిడివరం: చవితి మహోత్సవాల్లో భాగంగా మహాగణపతికి సోమవారం పలు ఆలయాల్లో విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రతి కూడలిలో ఏర్పాటు చేసిన గణనాథులకు తెల్లవారుజాము నుంచి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో గణపతి బప్పా మోరియా అంటూ స్వామి నిమజ్జనాన్ని నిర్వహించారు. అన్నంపల్లి వరసిద్ధి వినాయక ఆలయంలో లక్షగరికపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

వినాయకునికి 21 రకాల పండ్లతో అలంకరణ

తాళ్లరేవు: గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా పిల్లంకలో గరికెల వినాయకునికి 21 రకాల పండ్లతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. స్థానిక గ్రామదేవతలు నూకాలమ్మ, రావులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వినాయక యూత్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అర్చకుడు సుదర్శనం గోపాలాచార్యులు నేతృత్వంలో యూత్ సభ్యులు గరికెలతో వినాయకుడిని తయారు చేశారు. 21 రకాల పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు.

గణపతి లడ్డూకు రూ.20 వేలు

అల్లవరం: వినాయక చవితి పురస్కరించుకుని దేవగుప్తం సెంటర్లో గణపతికి సమర్పించిన 10 కేజీల లడ్డూని ఇదే గ్రామానికి చెందిన పెచ్చెట్టి వీర వెంకట సత్యనారాయణ వేలం పాటలో రూ.20 వేలకి దక్కించుకున్నారు. వేలం పాటలో దక్కించుకున్న లడ్డుని తలపై పెట్టుకుని బాజా భజంత్రీలు, మేళతాళాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించి స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందించారు.



పిల్లంకలో 21 రకాల పండ్లతో గరిక వినాయకునికి చేసిన అలంకరణ

అప్రమత్తంగా ఉండండి

ఐ.పోలవరం: గోదావరి వరదల నేపథ్యంలో లోతట్టు పల్లపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ మధుసూదన్ తెలిపారు. వరదల సమయంలో మండలంలో పెద్ద ఎత్తున గణేష్ నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయని, చాలా మంది గోదావరిలో విగ్రహాలు వదులుతారని ఆయన గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నిమజ్జన ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు పంచాయతీ, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.